

కుక్కల దాడిలో జింకలు మృత్యువాత

ముద్దనూరు : అటవీశాఖ పరిధిలోని మైలవరం, ముద్దనూరు మండలాల్లో కుక్కల దాడిలో రెండు జింకలు మృత్యువాత పడ్డాయి. ముద్దనూరు అటవీశాఖ డిఆర్ఒ చంద్రశేఖర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం మండలంలో గురువారం సాయంత్రం క్రిష్ణ జింకపై కుక్కలు దాడి చేయడంతో చనిపోయిందన్నారు. ఈ జింకకు నాలుగేళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. శుక్రవారం ముద్దనూరులోని రాజులగురువాయపల్లెలోని పొలాల్లో మేత కోసం వచ్చిన ఆడ జింకపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందిందన్నారు. గ్రామస్తులు అడ్డుకున్నా ఫలితం లేదన్నారు. పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస మాట్లాడుతూ దాడిలో మృతి చెందిన ఆడ జింకకు 3 ఏళ్లు ఉంటాయన్నారు. దాని కడుపులో కూన జింక కూడా ఉందని, వారంలో ప్రసవించేదని చెప్పా రు. కొత్తపల్లి పశు వైద్య శాలలో క్రిష్ణ జింకకు, ఆడ జింకకు ముద్దనూరు పశు వైద్య శాలలో పోస్టు మార్టం నిర్వహించామన్నారు. వాటిని ఖననం చేసినట్లు డిఆర్ఒ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రత్నరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

పరిహాసమే!

999 పిడిఎఫ్‌లకు అందని పరిహారం
రూ.454 కోట్ల చెల్లింపులకు నిరీక్షణ
ఆందోళనలో గండికోట నిర్వాసితులు

'అందని ద్రాక్ష పుల్లన' సామెత చందంగా గండికోట నిర్వాసితుల పునరావాసం, పరిహారం పరిస్థితి తయారైంది. ఆధునిక దేవాలయాలకు పరిగణన పొందిన జలాశయాల కోసం తమ సర్వస్వాల్ని త్యాగం చేసిన త్యాగధనులను నిర్లక్ష్యం చేశారు. రాష్ట్ర విభజన అనంతర పరిస్థితిని పరిశీలిస్తే 2014 నుంచి 2023 వరకు పరిహారం చెల్లింపుల ప్రహసనం సాగుతూనే ఉంది. గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షల చొప్పున పరిహారం చెల్లింపులకు కసరత్తు చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే గండికోట నిర్వాసితులకు అదనంగా రూ.3.25 లక్షలను కలిపి రూ.10 లక్షల వరకు చెల్లింపులు చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన హామీ మేరకు రూ.454 కోట్లు చెల్లింపులు ఆచరణ దిశగా అడుగులు పడకపోవడంతో నిర్వాసితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పోలవరం నిర్వాసితుల తరుపున పాదయాత్ర చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లాలోని 15 రిజర్వాయర్లలో అత్యధిక రిజర్వాయర్ల కింద వేలాది మంది నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై కథనం...

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గండికోట రిజర్వాయర్ ముంపు పరిధిలోనికి జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల పరిధిలోని 22 గ్రామాలు ముంపు పరిధిలోనికి వచ్చిన సంగతి తెలిసిందే. వీటి పరిధిలో 17,809 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.1800 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. 16,800 పిడిఎఫ్‌లకు రూ.10 లక్షల చొప్పున రూ.1346 కోట్లు పరిహారం చెల్లించినట్లు సమాచారం. మిగిలిన 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్ల చెల్లింపులకు దశాబ్దాల తరబడి నిర్వాసితులు ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. ఫేజ్-1 కింద సిఎం హామీ కింద రూ.295 కోట్లు, మిస్సింగ్ పిడిఎఫ్‌లకు రూ.46 కోట్లు, ఫేజ్-2 కింద కొండాపురం గ్రామానికి రూ.53 కోట్లు, ఫేజ్-3 కింద రూ.999 పిడిఎఫ్‌లకు రూ.56 కోట్లు చొప్పున రూ.454 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వైఎస్ జగన్ గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షలకు అదనంగా 3.25 లక్షల చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని అరకొర చెల్లింపులు చేసి మిగిలిన నిర్వాసితులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. గండికోట నిర్వాసితులకు రూ.110 కోట్లతో 18 కాలనీలకు రూపకల్పన చేశారు. రూ.100 కోట్లతో 11 నిర్వాసిత కాలనీలను పూర్తి చేశారు. రూ.35 కోట్లు బిల్లుల్ని అప్‌లోడ్ చేశారు. మరో రూ.25 కోట్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. మొత్తం 18 నిర్వాసిత కాలనీల్లో ఎనిమిది కాలనీలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇదేతరహాలో ఉమ్మడి కడప జిల్లాలోని సోమశిల, బ్రహ్మసాగర్, పైడిపాలెం, అన్నమయ్య, సర్వరాయసాగర్, చిత్రావతి, శ్రీనివాసపురం రిజర్వాయర్ల పరిధిలోని నిర్వాసితులకు కోట్లాది రూపాయల మేరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిర్వాసితుల సమస్యలను పాలకులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

వైద్య ఆరోగ్యశాఖలో బది'లీల'లు

కడపలో మూడు స్తంభాలాట
16 ఏళ్లుగా కదలని సీనియర్ అసిస్టెంట్లు
గ్రామీణ ప్రాంత ఉద్యోగుల్లో ఆందోళన



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల పర్వం కొనసాగుతూనే ఉంది. సిఫారసు లెటర్ల మాటున దశాబ్దాల తరబడి ఉన్నచోటనే పాతుకుపోయారు. ఆర్‌డి కార్యాలయం రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతోనే ఇటువంటి పరిస్థితి తలెత్తిందనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా వందలాది మంది అర్హులైన ఉద్యోగులకు అన్యాయం చోటుచేసుకుంటోంది. పలుకుబడి కలిగిన ఉద్యోగులు ఏళ్ల తరబడి ఉన్నచోటనే పాతుకుపోవడంతోపాటు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. తాజాగా ఈనెల 20, 21, 22 తేదీల్లో ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు చేపట్టిన బదిలీల్లో ఇటువంటి ఉద్యోగులను బదిలీ చేయాలని కోరుతూ పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదుల బుట్టదాఖలు కావడం ఆందోళన కలిగిస్తోంది.

వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో సుమారు 23 విభాగాలకు పాత ఉమ్మడి జిల్లాల్లో సుమారు ఎనిమిది వేల మంది ఉద్యోగులు ఉన్నారు. కడప రీజినల్ డైరెక్టర్ ప్రాంతీయ కార్యాలయం ఈ నెల 20, 21, 22 తేదీల్లో చేపట్టిన బదిలీలకు 700 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 శాతం నిబంధన కింద రెండేళ్ల రిక్వెస్ట్ బదిలీలు, ఐదేళ్లు కాలపరిమితి నిండిన ఉద్యోగుల పారామీటర్ల కింద 525 మంది బదిలీలకు అర్హులైనట్లు సమాచారం. ఆయా జిల్లాల్లో కీలకమైన స్థానాల్లోని ఉద్యోగులు పలువురు సిఫారసు లెటర్ల మాటున తిష్ట వేసుకుని ఉన్నారనే విమర్శ పెద్ద ఎత్తున వినిపిస్తోంది.

16 ఏళ్లుగా ఫెవికాల్ వీరులు

తిరుపతి రుయా ఆస్పత్రిలో ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు సుమారు 20 ఏళ్లుగా తిష్ట వేసుకుని కూర్చున్నారనే విమర్శ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తాజా బదిలీల్లో సదరు సీనియర్ అసిస్టెంట్లను యథాతథంగా కొనసాగించడం ఆందోళన కలిగించింది. వీరిని బదిలీ చేసి సీనియారిటీకి ప్రాధాన్యత కల్పించాలని కోరిన ఆశావహుల ఆశలు బుట్ట దాఖలు చేయడం విస్మయాన్ని కలిగించింది. ఇటువంటి ఉదాహరణలు జోన్-4 పరిధిలోని బదిలీల్లో కొల్లలుగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

కడపలో మూడు స్తంభాలాట

కడపలో ఆర్‌డి కార్యాలయం, డిఎంహెచ్ఒ కార్యాలయం, రిమ్స్ కళాశాలల మధ్య మూడు స్తంభాలాట కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతుండడం గమనార్హం. ఆర్‌డి కార్యాలయం నుంచి నర్సింగ్ కళాశాలకు, నర్సింగ్ కళాశాల నుంచి ఆర్‌డి కార్యాలయానికి బదిలీలు చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన ఉద్యోగులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ కావడం నిబంధనలు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. తాజా బదిలీల్లో ఇటువంటి నిబంధనలు సిఫారసు లెటర్ల మాటున నలిగిపోతున్నారు.

ఆర్‌డి ఆఫీసులో పైరవీల జోరు

రీజినల్ డైరెక్టర్ ప్రాంతీయ కార్యాలయం పైరవీలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. బదిలీల ప్రక్రియ ముగిసినప్పటికీ ఖాళీలు ఉన్నాయనే పేరుతో శుక్రవారం భారీగా మాడిఫికేషన్స్ పలువురు ఆర్‌డి కార్యాలయాన్ని చేరుకుని విజ్ఞప్తుల ముసుగులో పైరవీలు సాగిస్తున్నార నే వాదన వినిపిస్తోంది.

జగనన్న సురక్షతో సర్వం పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో పాటు ప్రజా సమస్యలకు సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపడమే 'జగనన్న సురక్ష' పథకం ప్రధాన ఉద్దేశమని అని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా లాంఛనంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెసి గణేష్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారులు పి.శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బి.విజయలక్ష్మి, జడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య హాజరయ్యారు. విసి అనంతరం కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడంతో పాటు వారికి అవసరమైన సర్టిఫికెట్లు అవసరమైతే సర్వీస్ ఫీజు లేకుండా వాటిని ఉచితంగా అందించనుందన్నారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలకు, వివక్షకు తావులేకుండా నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు. జిల్లాలోని అందరు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో, బాధ్యతతో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక విసి హాలు నుంచి డిఆర్ఒ గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్‌డిని అభినందిస్తున్న ఏపీ ఎన్జీవో జిల్లా నాయకులు

ఆర్‌డిని అభినందించిన ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బదిలీలను ప్రశాంతంగా నిర్వహించిన రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్‌ని శుక్రవారం ఏపీ ఎన్జీవో నాయకులు అభినందించారు. జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.దస్తగిరి రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలు ప్రక్రియలో భాగంగా 20 నుంచి 22 వరకు పారదర్శకంగా బదిలీలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షులు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్య పూజయ్య, సిటి అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వరరెడ్డి, సిటీ కోశాధికారి నాగార్జున, పద్మనాబరావు, రామసుబ్బారెడ్డి, హుషన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి

కడప అర్బన్ : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, వక్కలపేట అడ్మిషన్ డ్రైవ్ హెడ్ టీచర్ ఎస్. నజీబుల్లా కోరారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మోజులో పడి డబ్బులు వృథా చేయవద్దని చెప్పారు. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ స్థాయిలో మించి ఉన్నాయన్నారు. మంచి అరగ్య వాతావరణంలో, సబ్జెక్టు క్వాలిఫైడ్ ఉపాధ్యాయలుతో బోధన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మహిళా ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు

కడప : మహిళ కేంద్ర కారాగారంలోని మహిళా ఖైదీలకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఖైదీల సంపూర్ణ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో కడపలోని ప్రత్యేక మహిళా కేంద్ర కారాగారంలో రక్త పరీక్షలు, ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జైలు సూపరింటెంట్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన మందులు ఇవ్వడంతో పాటు ప్రత్యేక పర్యవేక్షణ వారిపై ఉంచుతున్నట్లు తెలిపారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్, ప్రసాదు ఆరోగ్యం పై అవగాహన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, డిప్యూటీ జైలర్లు భువనేశ్వరి, ఇమాంబి, మహిళా జైలు డాక్టర్ శ్రీవాణి, ఉషా రాణి, మహిళా జైలు సిబ్బంది,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో వైవీయూ విద్యార్థులు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ -1 ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సరిత పర్యవేక్షణలో వాలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్, ఉపయోగపడని వస్తువులను తొలగించారు.

బుర్ఖా ధరించి..కత్తులతో పొడిచి
- కడపలో వైసిపి కార్యకర్త దారుణ హత్య

ప్రజాశక్తి-కడప అర్బన్



హత్యకు గురైన శ్రీనివాసులరెడ్డి

కడప నగరంలో పట్ట పగలే నడిరోడ్డుపై దారుణ హత్య కలకలం రేపింది. వైసిపి కార్యకర్తను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి అతిదారుణంగా హత్య చేశారు. ఆర్టీసి చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డికి ప్రధాన అనుచరుడైన శ్రీనివాసులరెడ్డి(42) ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురి కావడం కడప నగరంలో సంచలనం కల్గించింది. నగరంలోని సంధ్యా సర్కిల్ ఉన్న జిమ్‌లో వ్యాయామం ముగించుకుని ఇంటికి వెళుతున్న అతన్ని అటుగా బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు బురఖాలతో వచ్చి వేట కొడవలితో దాడి చేశారు. దాడిలో ఒంటిపై బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మతి చెందాడు. శ్రీనివాసులరెడ్డికి కొంత మంది వ్యక్తులతో ఉన్న భూతగాదాలే హత్యకు కారణమని తెలుస్తోంది. సిసి పుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. మత దేహాన్ని ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, కమలా పురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. హత్య వెనుక ఎవరున్నారో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రవీంద్ర నాథ్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. వైసిపి సీరియస్ కార్యకర్తగా పనిచేయడం వల్లే ప్రత్యర్థులు చంపేశారన్నారు. శ్రీనివాసులరెడ్డి హత్యా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షలు తనిఖీ

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ రెండు నాలుగు ఐదు సెమిస్టర్ల విద్యార్థులకు, ఆరో సెమిస్టర్ బ్యాక్లాగ్ విద్యార్థులకు శుక్రవారం నుంచి పరీక్షలు 57 పరీక్ష కేంద్రాలలో మొదలయ్యాయి. పరీక్షలకు 42,300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి నగరంలోని శ్రీహరి డిగ్రీ కాలేజ్, నాగార్జున డిగ్రీ కాలేజ్, ఖాజీపేట లోని సాహిత్య డిగ్రీ కాలేజ్ పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల చీఫ్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్లతో మాట్లాడారు.

రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి : జిఎం

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న జిఎం రవివర్మ

కెనరా బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల అరుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ పి. రవి వర్మ సూచించారు. కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం కడప వారి ఆధ్వర్యంలో శుక్రవారం రిటైల్, వ్యవసాయ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రుణాలకు సంబంధించిన విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామిక వ్యక్తులు, ఐఎల్ఎ, ఎపిఐఐసి, ఐఎల్ఐఎ కొప్పర్తి, ప్రముఖ వైద్య నిపుణులకు, వివిధ వ్యాపారవేత్తలు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైల్, వ్యవసాయ, పారిశ్రామిక వ్యాపారులకు సంబంధించి కెనరా బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణ కార్యక్రమాలను సమావేశానికి హాజరైన ప్రముఖులకు వివరించారు. కడప కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె. మురళీ మోహన్ మాట్లాడుతూ కడప జిల్లాలో ఉన్నటువంటి వ్యాపారవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు కెనరా బ్యాంకు ఎప్పుడు రుణాలను అందించడంలో ముందుంటుందని తెలిపారు. సమావేశంలో వివిధ ఖాతాదారులకు ఎంఎస్ఎం ఈ రుణాలు, ఇళ్ల రుణాలు, విద్యా రుణాలు, వాహనా వ్యక్తిగత రుణాలకు సంబంధించిన మంజూరు పత్రాలను జనరల్ మేనేజర్ పి. రవివర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశానికి ఏపీఐఐసీ చీఫ్ అడ్వైజర్, కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ఏ.వి. రాజశేఖర్, డిఎం లు ఎం. ఆయుబ్, ఎస్. రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తాం : కాంగ్రెస్

కడప : రాష్ట్రంలోనూ దేశంలోనూ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం కడపకు వచ్చిన ఆయన సిపి బ్రౌన్ లైబ్రరీని సందర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి జిల్లాలోని సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తాను కడప జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. సి పి బ్రౌన్ లైబ్రరీ సందర్శించిన వారిలో మేయ్యప్పన్, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, నర్రెడ్డి తులసిరెడ్డి, డెలికేట్ బండి శేఖరయ్య ఉన్నారు.

నిర్భయంగా ఉన్నప్పడే మహిళా సాధికారత : ఎస్‌పి

ప్రజాశక్తి - బద్వేలు



కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మహిళలు అన్ని రంగాలలో నిర్భయంగా విధులు నిర్వహించినపుడే మహిళా సాధికారత సాధ్య మవుతుందని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొ న్నారు. శుక్రవారం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవర ణంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ (వన్ స్టాప్ సెంటర్)ను ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా, మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేద, ధనిక అని తేడా లేకుండా కుటుంబ సమస్యలు వచ్చినప్పుడు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌కు వచ్చి తమ సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు. విదేశీ సంస్కృతికి మన సంస్కృతికి చాలా తేడా ఉందని తెలిపారు. విద్యార్థి దశ నంచే ఆడ పిల్లలకు మహిళా చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సెంటర్లో రెవెన్యూ సిబ్బందితోపాటు, న్యాయవాదులు, డాక్టర్లు కూడా సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. ఫిర్యాదు చేసిన ఏడు రోజులలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో మహిళ ఎస్ఐని నియమిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే సుధా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. ఎక్కువ శాతం ప్రభుత్వ పథకాలలో మహిళలకే అధిక ప్రాధాన్యత నిచ్చారని తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌కు ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను తెచ్చినందుకు ఎస్‌పికి కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళలు తమ ఉద్యోగ, వ్యాపారాలలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎస్‌పి నుంచి ఎస్ఐ స్థాయి వరకు అందరి ఫోన్ నెంబర్లు నోటీసు బోర్డులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, మెప్మా, మహిళలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల అమ్మకాన్ని అడ్డుకోవాలి

కడప అర్బన్ : ప్రయివేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డిఇఒ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్ కుమార్, నగర అధ్యక్షులు బుక్కే సురేష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు దోపిడీ చేస్తూ అధిక మయ్యాయన్నారు. కనీస వసతులు కల్పించకుండా విద్యార్థుల నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టకుండా ఉన్న ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతూ విద్యాసంస్థలను వ్యాపారమయంగా మార్చుకున్నారని కాబట్టి ఇలాంటి విద్యాసంస్థలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణాల స్వాహాపై విచారణ చేపట్టాలి

వల్లూరు : మండల సమాఖ్యలో పనిచేస్తున్న వెలుగు సిసి సునీత చేతివాటం ప్రదర్శించి మహిళా సంఘాల సొమ్మును స్వాహా చేశారని, జిల్లా ఉన్నతాధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని యానిమేటర్లు కోరారు. శక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాండారు. తమ పేరుతో మంజూరైన రుణాన్ని సిసి తమకు తెలియకుండానే రుణాలు స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల కిందటటిజి పల్లి గ్రామ సమాఖ్య లావాదీవీలో గోల్‌మాల్ చేసుకుందనే విషయాన్ని తెలుసుకుని తాము ఖాతా పుస్తకాలను పరిశీలించామని, తమ పేర్లపై రుణాలు మంజూరైనట్లు గమనించామని చెప్పారు. కానీ సిసి తమకు ఏ రుణం మంజూరు చేయలేదని వాపోయారు. అసలు గ్రామ సమాఖ్యలో ఆడిటింగ్ జరుగుతుందో లేదో అర్థం కావడం లేదన్నారు. ఇంత అవినీతి చోటు చేసుకుంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని యానిమేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సొమ్ము స్వాహా పై పీడీ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయంపై ఎపిఎం శైలజ స్పందిస్తూ తనకు తప్పెట్ల, లేబాక , దుగ్గాయపల్లి సంబంధించిన విఒఎలు ఫిర్యాదు చేశారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆమె చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న యానిమేటర్లు

కేంద్రీయ విద్యాలయాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప కేంద్రీయ విద్యాలయ పరిరక్షణకు కె.వి యాజమాన్యం, ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కె.వి స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి ఎల్.జితేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం సర్వసభ్య సమావేశం నరసింహులు అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా జి.తేంద్ర మాట్లాడుతూ సకాలంలో కె.వి. బస్సులు సమకూర్చడంలో కెవి, ఆర్‌టిసి యాజమాన్యం తీవ్రజాప్యం చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు కెవి వసతులు మెరుగు పరచాలని, విద్యా ప్రమాణాలు పెంచాలని ఈనెల 26న గ్రీవెన్సుసెల్‌లో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆర్‌టిసి అధికారుల, కెవి ప్రిన్సిపల్ దృష్టికి విన్నవిస్తామని చెప్పారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్. శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ కెవి, ఆర్‌టిసి యాజమాన్యం తల్లిదండ్రులు సమన్వయంగా ఉన్నప్పుడే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు అవగాహన పెంచుకుని ఐక్యతతో ముందుకురావాలన్నారు. అసోసియేషన్ మహిళవిభాగం అధ్యక్షురాలిగా హిరణ్మయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కెవి బస్ రూట్ -1 కన్వీనర్ రమేష్ బాబు, రూట్ 2 కో-కన్వీనర్ కరుణాకర్, రూట్ -3 కో కన్వీనర్ సురేంద్ర నాథ్ రెడ్డి, రూట్ - 4 కన్వీనర్ పవిత్రన్, రూట్ -5 కన్వీనర్ ఆంజనేయులు, రూట్ -6 కన్వీనర్ సాయి పాల్గొన్నారు. **పూర్తిస్థాయిలో బస్ పాస్‌లను ఇవ్వాలి..** కేంద్రీయ విద్యాలయాకు పూర్తిస్థాయి బస్సు పాసులు బస్సులు మంజూరు చేయాలని ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డికి తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 21న కెవి పునః ప్రారంభం అయినప్పటికీ ఒక్క బస్ పాస్ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఆరు బస్‌లు తిప్పాల్సివుండగా మూడు బస్‌లు మాత్రమే తిప్పుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కవీ విద్యార్థులకు గతంలో లాగా బస్ పాస్‌లు ఇవ్వటాన్ని సరళతరం చేయాలని కోరారు. జిల్లా ప్రజా రవాణా అధికారిని కలిసిన వారిలో జితేంద్ర, రాజు, నరసింహులు, చినబాబు, సుబ్బారాయుడు ఉన్నారు.

'ధనవృద్ధి'ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వినూత్నమైన ఎల్ఐసి 'ధనవృద్ధి' పాలసీని ప్రజలు వినియోగించుకోవాలని ఎల్ఐసి కడప డివిజన్ ఎస్డిఎం కె.గిరిధర్ అన్నారు. శుక్రవారం స్థానిక డివిజనల్ కార్యాలయంలో ఆయన 'ధనవృద్ధి' పాలసీ బ్రోచర్‌ను విడుదల చేస్తూ వివరాలు వెల్లడించారు. బీమా రక్షణ కలిగి ఉన్న ఫిక్సెడ్ డిపాజిట్ పాలసీ అన్నారు. పుట్టిన బిడ్డ నుండి 60 ఏళ్ల వయస్సున్న వారి వరకు ఎవరైనా పాలసీ తీసుకోవచ్చని పేర్కొన్నారు. పాలసీదారుల అవసరాలకు అనుగుణంగా బీమా రక్షణను ఒకటిన్నర రెట్ల నుంచి పది రెట్ల వరకు ఎంచుకోవచ్చని అన్నారు. అత్యధిక వడ్డీ రేటును అందించే ఈ పాలసీ సెప్టెంబర్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర మేనేజర్లు ఎల్లారెడ్డి, సత్య శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గురురాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



కరపత్రాల ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాంశాలలతో పాటు విశ్వ విద్యాలయాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ కళ్యాణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జులై 22,23 తేదీలలో నగరంలోని నిర్వహించబోయే మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బ్యాక్‌లాగ్ పోస్టులు, గ్రూప్-1, 1 గ్రూప్ 2 పోస్టులు పెంచాలన్నారు. ఎస్ఐ కానిస్టేబుల్ పోస్టులు 20వేల పైబడి ఖాళీగా ఉన్నాయన్నారు. సచివాలయం పోస్టులు 21 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని కూడా తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌వైఎఫ్ నాయుకులు నరసింహ, ప్రసాద్, సురేష్, అయ్యన్న, సుబ్బరాయుడు, గోపి పాల్గొన్నారు.

రాజీవ్ పార్క్, మార్గ్ పనులు పరిశీలన

ప్రజాశక్తి- కడప అర్బన్

కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ నగర అభివృద్ధి పనులలో భాగంగా రాజీవ్ పార్క్, రాజీవ్ మార్గ్ రోడ్డు పనులను శుక్రవారం ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. కేటాయించిన సమయానికి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు 20 వర్క్ డివైడర్ ప్లాంటేషన్ వర్క్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజీవ్ పార్క్ ముందు ఏర్పాటు చేసిన బేవర్స్ పనులు పరిశీలించి స్లోప్ ఆధారంగా ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు పనులలో ఎటువంటి జాప్యం ఉండరాదని, నాణ్యత లోపాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేటాయించిన సమయానికి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం

ప్రజాశక్తి - చాపాడు

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శనంగా నిలుస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వానికి గల తేడాను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో సిఎం జగన్ ప్రభుత్వం దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతు న్నాయన్నారు. కార్యక్రమంలో భాగ ంగా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యల గురించి అడిగి తెలు సుకుబ ంటారని తెలిపారు. వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ షరిఫ్, భరత్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, సచి వాలయ సిబ్బంది, వైసిపి నాయకులు సుబ్బరాయుడు, కిరణ్మయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రొద్దుటూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక ఒకటవ వార్డు సచివాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వర పరిష్కార దిశగా అడుగులు వేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జులై1 నుండి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు ధృవీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు ఛార్జీలు వసూలు చేయకూడదని ఎమ్మెల్యే అన్నారు. నాలుగు వారాల పాటు కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. వాలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పలు రకాల వ్యక్తిగత ధృవీకరణ పత్రాల జారీకి వినతులు స్వీకరించాలన్నారు. క్యాంపుల నిర్వహణ సమయంలో వినతుల స్వీకరణ కోసం డెస్కులు విడివిడిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అధారిటీ బోర్డు సభ్యులు కాకర్లనాగేషారెడ్డి, కౌన్సిలర్ పందిటి సరోజమ్మ, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శిపోరెడ్డి నరసింహారెడ్డి, బొల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మెన్ గోన ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కాలనీ సమస్యలు తీరుస్తాం

ప్రజాశక్తి- కొండాపురం

త్వరలో కాలనీ సమస్యలన్నీ తీరుస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని శాంతినగర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచాల,మధ్య పూలమాలలు తో స్వాగతం పలికారు. కాలనీలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అర్హులందరికీ అందుచున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని ప్రజలు ఎమ్మెల్యేకి కొన్ని సమస్యలను వివరించారు. ప్రధానంగా డ్రెయినేజీ, విద్యుత్, నీటి సమస్యలు తీర్చాలని కోరారు. కొందరు ముంపువాసులకు పరిహారం అందలేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ముంపు వాసులకు పరిహారం చెల్లిస్తామని పేర్కొన్నారు. ఎంపిడిఒ నాగ ప్రసాద్, సిఐ సుదర్శన్ ప్రసాద్, గ్రామ నాయకుడు బి.భాస్కర్ రెడ్డి, కొండు వాసుదేవరెడ్డి, కొండు నాగార్జునరెడి, బాబుల్ రెడ్డి అనంతపురం పెద్దిరెడ్డి, ఏటూరు సూర్యనారాయణ రెడ్డి, తిమ్మాపురం శేఖర్, సంకేపల్లి సుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ముచ్చుమర్రి సత్య, దామోదర్ రెడ్డి, నన్నేబాషా, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

వేంపల్లె : దోమల వల్ల వ్యాధులు వ్యాపిస్తాయని, నియంత్రణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యురాలు డాక్టర్ స్వాతి సాయి అన్నారు. శుక్రవారం మలేరియా వారోత్సవాలు సందర్భంగా తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా వ్యాధి ప్రబలుతుందని చెప్పారు. వర్షాలు కురిసినప్పుడు నీటి నిల్వలు అనేవి ఎక్కువగా ఉంటాయని చెప్పారు. వీటి వల్ల దోమలు ఉత్పత్తి చెందుతాయని తెలిపారు. కాబట్టి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. జ్వరం ప్రబలిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివుల్లా, సిహెచ్ఒ వెంకటరమణ, సూపర్ వైజర్ వెంకట లక్ష్మమ్మ, భాస్కర్, హరి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

మండలం పరిధిలో ఉన్న చెక్‌పోస్టుల వద్ద పోలీసులు విధులు సక్రమంగా నిర్వహించాలని కడప ఎఆర్ అడిషనల్ ఎస్పి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పులివెందులలో ఉన్న పలు చెక్ పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా డ్రిల్ చేయాలన్నారు. మండలంలో ముద్దునూరు రోడ్‌లో ఉన్న జెఎన్‌టియు కళాశాల వద్ద ఉన్న చెక్ పోస్ట్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కదిరి రోడ్డు, కడప- ముదిగుబ్బ రోడ్డులో ఉన్న చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం భాకరాపురంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న గార్డును పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ పోలీసులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

ప్రభుత్వాసుపత్రిలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలకు పనికి సమాన వేతనం కల్పించాలని శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రిలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. పాత జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అరుణ్ వెంకట నరసయ్య, విమల షమీనా భాను శాంతి శిల్ప నారాయణమ్మ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

స్థల వివాదంలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ

- ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం



ఘర్షణలో గాయపడిన బాధితుడు

స్థల వివాదంలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఐదు గురికి గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని కమ్మవారిపల్లెకు చెందిన కొమ్మినేని మాధవ, కొమ్మినేని సుబ్బయ్య గ్రూపుల మధ్య కొంత కాలం నుంచి స్థల వివాదం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం వివాద స్థలంలో ఒక గ్రూపుకు చెందిన వారు నిర్మాణ పనులు చేపడుతుండడంతో మరో గ్రూపు వారు అడ్డుకున్నారు. ఒకరినొకరు దుర్భాషలాడుతూ కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో కొమ్మినేని సుబ్బయ్య, మాధవ నాయుడు, మల్లేశ్వర, నాగలక్ష్మి, రామమోహన్‌కు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి వివాద స్థలంలో అక్రమ కట్టడాలు కట్టడంతో అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే దాడి జరిగిందని బాధిత గ్రూపుకు చెందిన వారు ఆరోపిస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి జైలు శిక్ష

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని వీరారెడ్డి అనే వ్యక్తికి చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ కమలాపురం న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. వివరాలు.. 2018 సంవత్సరంలో పట్టణానికి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి వద్ద రూ. 30 లక్షలను విజయవాణి స్కూల్ కరెస్పాండెంట్ వీరారెడ్డి అప్పుగా తీసుకున్నారు. ఆ నగదుకు సంబంధించి వీరారెడ్డి చెక్కులను ఇచ్చారు. ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో సుబ్బారెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో రూ.60 లక్షలు కాంపెన్సేషన్ ఇవ్వాలని, లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

శిథిలావస్థలో పశువైద్య భవనాలు



చిన్న గురువులూరులో అసంపూర్తిగా ఆగిపోయిన భవన నిర్మాణం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పలు గ్రామాలల్లో ఉన్న పశువైద్యశాలల భవనాలు శిథిలా వ్యవస్థకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పల్లవోలు, సీతారామపురం, చియ్యపాడు, అన్నవరం, చిన్న గురవలూరు, లక్ష్మీపేట, అనంతపురం, వెదురూరు, సోమాపురం గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటిలో పల్లవోలు, సీతారామపురం, చిన్న గురువలూరు, వెదురూరు గ్రామాల్లోని భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సీతారామపురంలో భవనం వెనుక వైపు కూడా నాలుగు సంవత్సరాల కిందట కురిసిన తుపానుకు కూలిపోయింది. ప్రస్తుతం ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఈ పశు వైద్యశాల మూతపడింది. పల్లవోలలో భవనం పైకప్పు చాలావరకు దెబ్బతింది. సోమాపురంలో భవనం పూర్తిగా దెబ్బ తినడంతో దాని స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఐదుళ్లుగా నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో మూతపడిన పాఠశాలలో పశువైద్యశాల నడుస్తోంది. చిన్న గురువలూరులో భవనాలు వర్షానికి ఊరుస్తూ పైకప్పు ఊడి పడుతుంది. ఇక్కడా నూతన బిల్డింగ్ నిర్మాణాన్ని చేపట్టి నిధులు లేవని పనులు మధ్యలోనే ఆపివేశారు. చియ్యపాడు, అన్నవరం, లక్ష్మీపేట గ్రామాల్లోని భవనాలు కొంతలో కొంత నయంగా ఉన్నాయి. వెదురూరులో నూతన భవనానికి నిధులు మంజూరైనప్పటికీ స్థల సమస్యతో ఇక్కడా దెబ్బతిన్న భవనంలో లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా చిన్న గురువలూరు, సోమాపురంలో మధ్యలో ఆగిపోయిన భవనాల పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పల్లవోలు, సీతారామపురం గ్రామాల్లో నూతన భవనాలు ఏరాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే సత్తా కేవలం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక దొరసానిపల్లిలో రూ.70 లక్షలతో డ్రెయినేజీ కాలువకు భూమి పూజా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌కు ప్రజలందరూ మద్దతుగా నిలబడాలని కోరారు. అందరూ బాగుండాలన్నదే సిఎం జగనన్న అభిమతమని, ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. సమస్యలు లేని రాష్ట్రాన్ని తయారు చేయడమే సిఎం జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. విభజన నాటి నుంచి, ప్రస్తుత సమస్యలు ఒక్కోదాన్ని పరిష్కరించుకుంటూ అభివృద్ధి సంక్షేమంపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అధోగతేనని, ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలన్ని రద్దు చేస్తారని విమర్శించారు.గతంలో 600 హామీలు ఇచ్చి ఆరు హామీలు కూడా అమలు చేయని వ్యక్తి చంద్రబాబు అన్నారు. 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి పేదలకు చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరవ ఈశ్వరమ్మ మునివర, ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రొద్దుటూరు మండల ఇన్‌ఛార్జి మార్తల ఓబుల్‌రెడ్డి, ఎంపిటిసి మేరీ అశోక్, మునివర, దొరసాని పల్లె వైసిపి నాయకులు పునరుద్రారెడ్డి, చిన్న రెడ్డి, పాతకోట బలరాం రెడ్డి,రామ్మోహన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం రసాభాసగా కొనసాగింది. చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి కౌన్సిలర్లు సమస్యలను ఏకరూవు పెట్టారు. తమ వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 13వార్డు శ్రీరామ్‌నగర్‌లో రోడ్డు వేయాలని వార్డు కౌన్సిలర్ పాశం లక్షుమ్మ కోరారు. పైప్ లైన్ వేసిన తర్వాత మాత్రమే రోడ్లు వేస్తామని మున్సిపల్ ఇంజినీర్ తెలిపారు. డ్రెయినేజి కాలువలు ఏర్పాటుకు ఆక్రమణలు అడ్డువస్తున్నాయని పేర్కొన్నారు. నాలుగో వార్డులో పది రోజుల కిందట మోటర్ కాలిపోయిందని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదు చేశారు. పనితీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అత్యవసర ప్రాతిపదికన పనులు చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యేను టిడిపి కౌన్సిలర్లు కోరారు. అజెండాలలో పేర్కొన్న పనులు చేపట్టడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 2000 మెట్రిక్ టన్నుల సిమెంట్ మున్సిపాలిటీకి వస్తుందని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే చెప్పారు. వచ్చే అజెండాలో ఎన్ని అభివృద్ధి పనులు చేశారో పెట్టించి చర్చించడానికి సిద్ధమా అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి ,సంక్షేమం ప్రజలకు వివరిస్తున్నామని ప్రజలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎర్రమట్టి కుప్పలను తొలగించాలి : సిఐటియు

ప్రజాశక్తి- జమ్మలమడుగు



మట్టి కుప్ప వద్ద నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు, సిఐటియు నాయకులు

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసుకున్న ఆటో స్టాండ్ వద్ద ఉన్న ఎర్రమట్టి కుప్పలను తొలగించాలని సిఐటియు నాయకులు దాసరి. విజయ్, నాయకుడు ఆటో యూనియన్ అధ్యక్షులు ఆదామ్, ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటో స్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా పెద్ద పసుపుల, ఉప్పలపాడు గుండ్లకుంట, నోస్సం, తదితర గ్రామాల నుంచి ఆటోలను నిలుపుకుంటూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఇటీవల తహశీల్దార్ కార్యాలయ ప్రహరీ నిర్మించడం వల్ల ఆటో కార్మికులకు ఇబ్బంది కలిగిందని తెలిపారు. గతంలో ఆటో కార్మికుల నిరసన చేయడం వల్ల స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి 6,7 ఆటోలు పట్టే విధంగా స్థలాన్ని కేటాయించారని అన్నారు. ఇప్పుడు 10,15 రోజుల కిందట నుంచి ఆటోలు నిలుపుకునే స్థలంలో రెండు లారీల ఎర్రమట్టి తోలడంతో ఆటోలు పెట్టుకొలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆటోలన్నీ రోడ్లపై ఉండడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు ఆటోలపై ఫైన్ లు వేసి దాడులు చేస్తున్నారని వాపోయారు. తహశీల్దార్ కార్యాలయం వద్దకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు బైక్‌లో వస్తుంటారని, దీంతో వారూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పైగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని తెలిపారు. ప్రజలు కూడా బస్సులు దిగి వెళ్లేటప్పుడు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆటో కార్మికులకు ఇబ్బంది కలగకుండా వాహనా చోదకులకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆటో స్టాండ్ నాయకులు అబ్రహం, ఈశ్వరయ్య కిరణ్, రాజు , దివాకర్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఎపి భవిష్యత్తుకు చంద్రబాబే గ్యారెంటీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

రాష్ట్ర భవిష్యత్తుకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఒక్కరే గ్యారెంటీ ఇవ్వగలరని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రజా చైతన్య రథం బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా రాజుపాలెం మండలం దద్దనాల గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కసారి అవకాశం పేరుతో అధికారం చేపట్టిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో నయవంచన చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని అరాచకాలు, ఆగడాలు, దురాక్రమాలు అధికమయ్యాయని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం వస్తుందని మహిళలకు మహాశక్తి ద్వారా 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఆర్థిక సాయం చేస్తారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో పిల్లలందరికీ రూ.15వేలు, దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల కన్వీనర్ ధని రెడ్డి విశ్వనాథరెడ్డి, కులూరు మాజీ సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, నారాపురెడ్డి, చంద్రారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, సహదేవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు

పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి-చాపాడు

స్థానిక మున్సిపాల్టీలోని 20వ వార్డు పరిధిలో ఉన్న ఉప్పు వాగు పూడికతీత పనులు వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పు వాగులో పూడికతీత పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి కి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 40 ఏళ్లుగా జోసఫ్‌పేట్, వెంకటసుబ్బయ్య కాలనీ, చెంచు కాలనీ, ఇందిరమ్మ కాలనీ , సుందరయ్య కాలనీలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల షెడ్యూల్డ్ కులాలు, తెగలు వెనుకబడిన వర్గాలు స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కాలనీల మధ్యలో ఉప్పు వాగు ప్రవహిస్తుందని, ఇందులో గత 50 ఏళ్లగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికి పై భాగంలో లోని వర్షపు నీరు కాలనీలను మునకకు గురిచేస్తుందన్నారు. ఏడాదిలో నీటి ప్రవాహానికి సామాన్లు, నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి ఉప్పు వాగులో పూడికతీత పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రంలోని శివ సాయి గ్లోబల్ హైస్కూల్ విద్యార్థి టి. వేద సర్వజ్ఞ అ నవోదయ పాఠశాలకు ఆరవ తరగతిలో చేరడానికి ఎంపికయ్యాడు. పాఠశాల కరస్పాండెంట్ శాంబశివ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు కిషోర్ రెడ్డి,ఉపాధ్యాయులు ఈసందర్భంగా విద్యార్థిని అభినందించారు. విద్యార్థి తల్లి తండ్రులు బాలచంద్ర, భువనేశ్వర్ తమకుమారుడు నవోదయకు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఇఒ స్టాలిన్ ఐజాక్

విభిన్న ప్రతిభావంతులకు అన్ని సౌకర్యాలు

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అమలు చేస్తామని ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్ తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కింద మంజూరైన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా చేస్తామని చెప్పారు. ఆత్మ విశ్వాసంతో విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. బ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం నరసింహారెడ్డి అందజేసిన నోటు పుస్తకాలను, పన్నులను కూడ విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్వరమ్మ, ఉమామహేశ్వరి, ఐఇఆర్టీలు యశోధ, సుజాత, సిఆర్పి ప్రకాష్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో ప్రజలకు మరింత చేరువయ్యేలా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మండలంలోని ప్రతి సచివాలయంలోనూ నిర్వహించేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. కార్యక్రమానికి సంబంధించి ఉన్నతాధికారులు రెండు టీములను నియమించారు. తహశీల్దార్ నాగేశ్వరరావు, పిఆర్ అండ్ ఆర్‌డి రంతులయ్య ఆధ్వర్యంలో ఒక టీమ్, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మరో టీమ్ పనిచేయనున్నాయి. కార్యక్రమం జులై 1 నుంచి మొదలుపెట్టేలా సంబంధిత అధికారులకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. మండలంలోని ప్రతి సచివాలయంలో షెడ్యూల్లో నిర్ణయించిన తారీకులలో క్యాంపులో నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించడంతోపాటు సర్వీస్ ఫీజు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తారు.

జగనన్న సురక్ష పేదవారికి అండ

పులివెందుల టౌన్ : జగనన్న సురక్ష పేదలకు రక్షణగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ ఉద్యోగులకు వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జగనన్న సురక్షపై ఈనెల 24 నుంచి సచివాలయ సిబ్బంది, వాలంటరీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారని చెప్పారు. జులై ఒకటి నుంచి సచివాలయాల వద్ద నాలుగు వారాలు పాటు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని రకాల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతాయన్నారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలకు సర్వీస్ ఛార్జీలు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రమణయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్రొద్దుటూరు టౌన్ : ఎడవల్లి రమణయ్య భాగవతార్‌కు హైదరాబాద్ లోని భాస్కర్ ఆడిటోరియంలో ఈనెల 21న మనం ఫెడరేషన్ గౌరవ డాక్టరేట్ అందజేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లోఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో హరికథ గానం చేస్తున్నానన్నారు. హరికథ కౌశల్యకు మెచ్చుకొని తనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చారని తెలిపారు. కళాభిమానం ఉన్న కళాకారులు అందరికీ తన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎడవల్లి రమణయ్య, మూలే రాముని రెడ్డి, జయదేవ్ వర్మ పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీలో 90 శాతం ఉత్తీర్ణత

బి.కోడూరు: మండలంలోని గోవిందాయపల్లె జడ్‌పి హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం పుల్లయ్య, సహోపాధ్యాయులు పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక క్లాసులు తీసుకొని విద్యార్థులకు మంచి బోధన అందించడంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ఇసుక అక్రమ నిల్వలపై చర్యలేవీ?

కొండాపురం : మండలంలో ఇసుక అక్రమ నిల్వలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. ఇందుకు అధికారుల నిర్లక్ష్యం కారణమని తెలుస్తోంది. కొండాపురం మండలం కోడూరు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి నిల్వలు ఉంచారు. ఇక్కడ దాదాపు 500 ట్రిప్పు ఇసుక నిల్వ ఉన్నట్లు సమాచారం. ఈ నిల్వలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్రమ ఇసుక త్రవ్వకాల పై అధికారుల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభినందనల వెల్లువ

దువ్వూరు : మండల విద్యాశాఖ అధికారి - 2 గా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌కి అభినందనలు తెలియజేసిన రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి 2 భాస్కర్ మాట్లాడుతూ ప్రతి జడ్‌పి పాఠశాల, యుపి పాఠశాలలు సందర్శించి అక్కడ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, తదితరాలను తనిఖీ చేస్తానన్నారు. పిల్లలకు అందించే పాఠ్యపుస్తకాలు, భోజనాలు, ఇతర వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

గర్భిణీకి రక్తదానం

పోరుమామిళ్ల టౌన్: కాశినాయన మండలం వరికుంట్ల గ్రామానికి చెందిన శ్వేత అను గర్భిణీ పోరుమామిళ్లలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆమెకు ఎ పాజిటివ్ రక్తం అవసరమని సూచించడంతో ఆమె బంధువులు రక్తం కోసం రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ స్పందించి పోరుమామిళ్ల మండలం వినాయక నగర్‌కు చెందిన పురం వీర కిషోర్ రాయల్ చే ఏ పాజిటివ్ రక్తం అత్యవసరంగా రక్త దానం చేయించారు. రక్తం అవసరమైన వారు 8125991900, 9182990214 లలో సంప్రదించాలన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

వేంపల్లె : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయాలు చేస్తే దుకాణ యాజమానులపై కఠిన చర్యలు తీసుకొంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని ఎరువుల దుకాణాలను ఎస్ఐ తిరుపాల్ నాయక్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. ఎరువుల దుకాణాల్లో ఉన్న విత్తనాలు, పురుగు మందులను తనిఖీ చేసి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులను, విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. అధిక ధరలకు విక్రయాలు చేయడం నేరం అన్నారు. తనిఖీల్లో ఎఎస్ఐ అన్వర్ బాష, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చక్రాయపేట : కల్తీ ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం సిఐ గోవింద రెడ్డి, చక్రాయపేట ఎఐ వినోద్ కుమార్, మండల వ్యవసాయాధికారి నవంత్ బాబు, సంయుక్తముగా కలిసి, మండలంలోని నాగులగుట్ట పల్లెలో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకంలో, రైతు కొనుగోలులో, రైతు ఏ విధంగా మోసపోకుండా, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఎరువుల దుకాణాలను పరిశీలించి, డీలర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నామని చెప్పారు. దుకాణ యజమానులు వివిధ రకాల విత్తనాలను పరీక్ష కోసం సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు ఎఒ పేర్కొన్నారు.

NAME CHANGE

My Son's Name BOMMANA BOINA REDDY VENKATA NITHYA POOJA VYAS is Changed as BOMMANABOYINA RISHI.
FATHER : B.SUBBAIAH
MOTHER : B. SUBBA RATHNAMMA,
D.No. 15/247, Bestha Colony, Chennur, Y.S.R. Kadapa Dt.
CELL: 9440691980.